క్లుప్తంగా

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని బొందలపాటి మార్కెటింగ్ ప్రైవేటు లిమిటెడ్ 34వ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం 74 మంది విద్యార్థులకు రూ.2,100 చొప్పున ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. గత టెన్త్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపి, ప్రస్తుతం ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులకు ప్రోత్సాహంగా ఉపకార వేతనాలు పంపిణీ చేసినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బొందపాటి వేంకట ఫణికుమార్ తెలిపారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్ మొగ్రా, రవితేజ, ఉమాదేవి, రామ్ ప్రసాద్, రాజు, శివనాగేశ్వరరావు, సంస్థ మేనేజర్ వేల్పూరి మారుతిరాము పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నగరంపాలెం: కృష్ణాష్టమి సందర్భంగా బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో విశ్వ శాంతిని కాంక్షిస్తూ చండీహోమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భారతీ, ధార్మిక విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. మేకా దేవేంద్ర కుటుంబ సభ్యులతో తొమ్మిది మంది వేద పండితుల నిర్వహణలో గణపతికి, శివ లింగానికి, నవ గ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీ గణపతి, చండీ, రుద్రహోమాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా వినియోగదారుల పరిరక్షణ సంస్థ గౌరవ సభ్యునిగా పొత్తూరి రంగారావు



నగరంపాలెం: గుంటూరు జిల్లా వినియోగదారుల పరిరక్షణ సంస్థ గౌరవ సభ్యుడిగా కళాదర్బార్ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు నియమితులయ్యారు. గుంటూరు అరండల్‌పేట ఆరో వీధిలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రంగారావు మాట్లాడుతూ జిల్లా వినియోగదారుల పరిరక్షణ సంస్థ గౌరవ సభ్యునిగా నియమిస్తూ ఈనెల 11న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వినియోగదారుల సమస్యలను అధికార యంత్రాంగ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తానని చెప్పారు.

దివ్యాంగ జంటకు వివాహం

నెహ్రూనగర్: దివ్యాంగుల వివాహ ఇన్ఫో సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ భవన్‌లో దివ్యాంగ జంటకు వివాహం జరిపించారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన నాగమణి, చీరాల చెందిన రమేష్ బాబుకు బంధుమిత్రుల మధ్య వివాహం జరిపించారు. సందర్భంగా సొసైటీ అధ్యక్షులు నాగశ్రీ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా సొసైటీ ఆధ్వర్యంలో దివ్యాంగ జంటలకు వివాహాలు జరిపిస్తున్నామని, ఇప్పటి వరకు 181 దివ్యాంగ జంటలకు వివాహాలు జరిపించామన్నారు. దివ్యాంగులకు వివాహం జరిపించవలసిన వారు తమను 85558 10100 కు సంప్రదించవచ్చు అన్నారు. అనంతరం నవ వధువు నాగమణి కావలసిన ఆర్థిక సహాయ సహకారాలు అందించిన ఉమాదేవి కుటుంబానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి



కోల్‌కతా ఘటన వైద్య విద్యార్థునుల్లో ఆందోళన కలుగజేసింది. సుప్రీంకోర్టు సుమోటాగా చర్యలు చేపట్టే వరకు ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గం. దీంతో విద్యార్థులతో పాటు తల్లితండ్రుల్లో ఆందోళన కలగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

– డాక్టర్ ఎ.శివనాగేంద్రరెడ్డి, ఎన్‌ఆర్‌ఐ, మంగళగిరి



పునరావృతం కాకుండా చూడాలి



ఎంతో దూరం వచ్చి తల్లితండ్రులకు దూరంగా చదువుకునే వారికి కోల్‌కతా లాంటి ఘటనలు ఎంతో ఆందోళన కలిగిస్తున్నాయి. తల్లితండ్రుల ఆశలు నెరవేర్చి, సమాజానికి వైద్య సేవలందించాలని కష్టపడి చదువుతున్నాం. ఇలాంటి ఘటనలు పునావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ ప్రియాంక, మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌ఎస్, మార్కేండేయ కాలనీ, మంగళగిరి

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ప్రజ్ఞ స్కూల్లో చిన్నికృష్ణుడు,గోపికలతో చక్రనాగ్, కోటేశ్వరరావు



యాపిల్ స్కూల్లో చిన్నారులతో ఇన్‌చార్జి శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు



సెయింట్ ప్యాటిక్స్ స్కూల్లో చిన్ని కృష్ణులతో గోపికలు

గుంటూరు ఎడ్యుకేషన్: మారుతినగర్‌లోని యాపిల్ స్కూల్లో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను జరుపుకున్నారు. ఈసందర్భంగా చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బి. పేరిరెడ్డి, ఇన్‌చార్జి శ్రీలక్ష్మి, ఏఓ లక్ష్మి పాల్గొన్నారు.

- లాలాపేటలోని సెయింట్ ప్యాట్రిక్స్ స్కూల్లో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు.
- నగరంపాలెంలోని ప్రజ్ఞ స్కూల్లో నిర్వహించిన సంబరాల్లో చిన్నికృష్ణులు, గోపికల వేషధారణలోని చిన్నారులు సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్.చక్రనాగ్, ప్రిన్సిపాల్ ఎస్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.
- ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇస్కాన్ ఆలయంలో..

నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ ఇస్కాన్ టెంపుల్‌లో సోమవారం జనచైతన్యకు చెందిన మాదల రత్నగిరిబాబు ఆధ్వర్యంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు జరిగాయి. మాదల సునీత, మాదల చైతన్య, మాదల మీనారత్న, మాదల శ్రీరామ్‌భాస్కర్, డాక్టర్ పాటిబండ్ల శివాజీ, డాక్టర్ మాదల పూజ హాజరై, శ్రీ కృష్ణుడ్ని దర్శించుకున్నారు. సుభద్ర బలరామ సమేత జగన్నాధుని ఆశీస్సులు పొందాలని భక్తులను కోరారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేయగా, ఇస్కాన్ గుడి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

శ్రీమేధలో..

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేటలోని శ్రీమేధ విద్యాసంస్థల్లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ శ్రీకృష్ణునికి పూజా కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ఉట్టి కొడుతున్న శ్రీమేధ చైర్మన్ అన్నా నందకిషోర్

బాలగోకులం పోటీలు..



సంస్కార భారతి పోటీలకు రాధాకృష్ణుల వేషధారణలో హాజరైన చిన్నారులు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలోని శ్రీపద్మావతి కల్యాణ మండపం, ప్రాంగణంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా రెండు రోజులపాటు జరిగిన పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన సుమారు 909 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్కార భారతి అధ్యక్షులు ఇండ్ల శ్రీధర్‌బాబు, ఆలయ పాలక మండలి అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య, సామజిక కార్యకర్తలు సురేష్‌కుమార్ జైన్, నరేంద్ర గౌతమ్, కె.రేణుకాదేవి, రవిబాబు, ఆచార్యులు సుధాకర్ పాల్గొనగా, అను డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో అన్నమయ్య నృత్య రూపకం ఆబాల గోపాలం ఆకట్టుకుంది. చిన్నారుల రాధాకృష్ణుల వేషధారణలు అలరించాయి.



సుమేధ హైస్కూల్లో చిన్నికృష్ణుడు, గోపికలతో డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ రెడ్డి

శాంతి సమాజ స్థాపకురాలు మదర్ థెరిసా

నెహ్రూనగర్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మానవ సేవకు ప్రతిరూపమైన మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకొని లక్ష్మీపురంలోని మదర్ థెరిసా విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. మానవత చైర్మన్ పావులూరి రమేష్ మాట్లాడుతూ యుగేస్లావియాలో జన్మించిన మదర్ థెరిసా భారతదేశంలో స్థిరపడి పేద ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందించారని కొనియాడారు. అతిచిన్న వయసులోనే తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి కోల్‌కతాలో భయంకరమైన వ్యాధులు సోకిన నిరుపేదలు, అభాగ్యులకు తన సేవల ద్వారా జీవితాన్ని ప్రసాదించారన్నారు. ప్రపంచంలోని 123 దేశాల్లో 610 శాఖాలతో మిషన్ ఆఫ్ చారిటీస్ తరఫున అనేక మంది పేద ప్రజలకు సేవలు అందించి నోబెల్ శాంతి బహుమతి, భారతరత్న లాంటి అవార్డులు అందుకున్నారని కార్యదర్శి కె.సతీష్ తెలిపారు. కార్యక్రమంలో నిర్మల్‌హృదయ సిస్టర్స్, సంస్థ కోశాధికారి టీవీ సాయిరాం, పి.సుధాకర్, అనంతరామయ్య, విజయలక్ష్మి, సురేష్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



మదర్ థెరిసా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సామాన్య కార్యకర్తలకు బీజేపీలో ప్రాధాన్యం

జిల్లా అధ్యక్షుడు నరేంద్ర కుమార్

గుంటూరు మెడికల్: సామాన్య కార్యకర్తకు ఉన్నత స్థాయి కల్పించిన పార్టీ బీజేపీయేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నాలుగో మండలంలోని అరండల్‌పేటలోని రాష్ట్ర మీడియా కో కన్వీనర్ వెలగలేటి గంగాధర్ నివాస ప్రాంగణంలో మండల అధ్యక్షుడు పెమ్మరాజు సుధాకర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్రకుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదుకు మిస్డ్ కాల్ నెంబర్ గా 8800002024 ను కేంద్ర పార్టీ కేటాయించిందని తెలిపారు. సెప్టెంబరు 1న భారత ప్రధాని నరేంద్రమోదీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ద్వారా సభ్యత్వం తీసుకుంటారని వెల్లడించారు. సెప్టెంబర్ 2న రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి సభ్యత్వం తీసుకుంటారన్నారు. మండల సభ్యత్వ నమోదు ప్రముఖ్ పెద్దింటి శ్రీకృష్ణ చైతన్య, సహ ప్రముఖ్‌లు మండలపు సురేష్ చౌదరి, పద్మనాభుని రమాదేవి క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ తిరుపతి రావు, జిల్లా ఉపాధ్యక్షురాలు బి.సుగుణ, నాయకులు ఈ శ్రీనివాసరెడ్డి, వి.గంగాధర్, ఎం.అశోక్ నాగసాయి, వి.తిరుమలరావు, బి.రామకృష్ణ, ఎం.మనోహర్ పాల్గొన్నారు



మాట్లాడుతున్న వనమా నరేంద్ర కుమార్

మాస్టర్‌మైండ్స్ విజయోత్సవ ర్యాలీ

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్స్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ఇటీవల ప్రకటించిన సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల విద్యార్థులు అఖిల భారతస్థాయిలో టాప్ ర్యాంకులను కైవసం చేసుకున్న సందర్భంగా సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బ్రాడీపేటలోని సంస్థ క్యాంపస్ నుంచి అధ్యాపకేతర సిబ్బందితో బయలుదేరిన బైక్ ర్యాలీని మెయిన్ క్యాంపస్ ఇన్‌చార్జ్ వై.శ్రీనివాసరావు, ఆంజనేయ విజయకుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎంఏ ఫైనల్‌లో తమ విద్యార్థులు అఖిల భారత స్థాయిలో ఒకటో ర్యాంకు సహా 3, 8వ ర్యాంకులతో పాటు సీఎంఏ ఇంటర్‌లో 3, 9వ ర్యాంకులను సాధించడం ద్వారా చరిత్ర సృష్టించారని అన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులతో పాటు వారిని ప్రోత్సహించిన అధ్యాపకులను, తల్లిదండ్రులను అభినందించారు. క్యాంపస్ వద్ద స్వీట్లు పంచుకుని, బాణసంచా కాల్చి విజయోత్సవాలను జరుపుకున్నారు. శంకర్ విలాస్ సెంటర్, లాడ్జి సెంటర్ మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

ప్రైవేటు ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. సదరన్ ప్రైవేటు అధ్యాపక, ఉపాధ్యాయ సంస్థ(ఎస్పీఎల్టీఏ) ఆధ్వర్యంలో సోమవారం ఏసీ కళాశాలలోని ఆడిటోరియంలో ఉత్తమ ఉపాధ్యాయులకు డాక్టర సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులని, వారిని గౌరవించుకోవడం మన విధి అని అన్నారు. తూర్పు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేలు ఎండీ నసీర్ అహ్మద్, గల్లా మాధవి మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య, ఏఎన్‌యూ రెక్టార్ రత్నషీలామణి, ఏసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్, వైస్ ప్రిన్సిపాల్ అమృతవర్షిణి, కన్న స్కూల్ డైరెక్టర్ కన్న మాస్టారు, అపుస్మా, ప్రైవేటు స్కూళ్ల యాజమాన్య నాయకులు కాటూరి వెంకటేశ్వరరావు, మేకల రవీంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గల్లా మాధవిని సత్కరిస్తున్న దృశ్యం

నగరంలోకి భారీ వాహనాలకు అనుమతి లేదు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా ఉదయం సమయాల్లో నగరంలోకి భారీ వాహనాలు ప్రవేశిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని వెస్ట్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 10.30 గంటల వరకు చుట్టుగుంట వైపు నుంచి ఎస్వీఎన్ కాలనీ, జేకేసీ కళాశాల, శ్యామలానగర్ రహదారుల వైపు నుంచి ట్రాక్టర్లు, లారీలకు ఎటువంటి ప్రవేశం లేదని తెలిపారు. నో ఎంట్రీ సమయంలో నగరంలోకి భారీ వాహనాలు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, నిబంధనలకనుగుణంగా లారీ, ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు వ్యవహరించాలని సూచించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు


పట్నంబజారు: గంజాయి నిల్వలు కలిగి ఉండి, విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. వసంతరాయపురానికి చెందిన మైనంపాటి వెంకటేశ్వర్లు, వెంకటశివరామకృష్ణ గంజాయి విక్రయిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం అర్ధరాత్రి దాడిచేశారు. వసంతరాయపురంలోని వారి నివాసాల్లో రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

లూపస్ వ్యాధికి లొంగొద్దు

గుంటూరు బ్రాడీపేటకు చెందిన 23 ఏళ్ల సుజాతకు వివాహమై మూడేళ్లు అయినా సంతానం కలుగలేదు. ఆరు నెలలుగా కీళ్ల నొప్పులు ఉన్నా పట్టించుకోకుండా తన రోజువారీ పనులు చేసుకుంటుంది. నొప్పులకు తోడు ఆయాసం రావటంతో ఓ రోజు భర్తకు తన ఆరోగ్య పరిస్థితి తెలియజేయటంతో ఆయన సూచనలు మేరకు ఆస్పత్రికి వెళ్లింది. డాక్టర్లు పరీక్షలు చేసి రెండు కిడ్నీలు ఫెయిల్ అయ్యాయని దీనికి కారణం లూపస్ వ్యాధి అని నిర్ధారించారు. ప్రతిరోజూ కిడ్నీలు ఫెయిల్ అయ్యి తమ వద్దకు వస్తున్న వారిలో లూపస్ వ్యాధి బాధితులు ఉన్నారని గుంటూరుకు చెందిన సీనియర్ కిడ్నీ వ్యాధి నిపుణులు డాక్టర్ చింతా రామకృష్ణ చెబుతున్నారు.

– గుంటూరు మెడికల్

లూపస్ అంటే లాటిన్‌లో తోడేలు అని అర్థం. ఈవ్యాధి ఆటో ఇమ్యూనో వ్యాధి. ఈ వ్యాధి ఎందుకు వస్తుందో, ఎలా ప్రవర్తిస్తుందో కారణాలు పూర్తిగా తెలియదు. సాధారణంగా శరీరంలో ఉన్న ఇమ్యూనిటీ సిస్టమ్ బయటి నుంచి వచ్చే ఇన్‌ఫెక్షన్‌లు, ఫారిన్‌బాడీస్‌ను ఎదుర్కొని మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి తోడ్పడుతుంది. ఇమ్యూనిటీ సిస్టమ్‌లో లోపాలు వల్ల శరీరంలో వివిధ అవయవాల్లో ఉండే సాధారణ కణాలు ఫారిన్ బాడీస్ వలన గుర్తింపబడి సాధారణ కణాలు విచ్ఛిన్నమై అవయవాలు దెబ్బతినడం వల్ల లూపస్ వ్యాధి వస్తుంది. ఇన్‌ఫెక్షన్లు, హార్మోన్లు, కొన్ని రకాల మందుల వల్ల వ్యాధి సోకే అవకాశం ఉంది.



లూపస్ వ్యాధి పోస్టర్లు

- వ్యాధి గుర్తించేలోగా మరణిస్తున్నారు
- ప్రాథమిక దశలో గుర్తిస్తే నివారించవచ్చు

జిల్లాలో బాధితులు...

లూపస్ వ్యాధి ముఖ్యంగా మహిళల్లో వస్తుంది. ప్రతి పది మంది వ్యాధి గ్రస్తుల్లో 8 మంది మహిళలే. 15 నుంచి 45 వయస్సులో ఉన్న వారికి ఈ వ్యాధి వస్తుంది. మగవారిలో, చిన్నపిల్లల్లో, వృద్ధాప్యంలో ఉన్నవారికి వ్యాధి వస్తే తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కుటుంబంలో ఒకరికి వ్యాధి ఉంటే వారసత్వంగా ఇతరులకు వస్తుంది. గుంటూరులో ఐదుగురు రుమటాలజీ వైద్య నిపుణులు ఉన్నారు. ప్రతినెలా ఒక్కో డాక్టర్ వద్దకు పది మంది వ్యాధి బాధితులు చికిత్స కోసం ఆసుపత్రికి వస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

వ్యాధి లక్షణాలు..

తల నుంచి కాళ్ల వరకు, కిడ్నీల నుంచి గుండె వరకు దాడికి దిగి అవయవాలను దెబ్బతీస్తుంది. దీర్ఘకాలంగా జ్వరం ఉండటం, బరువు తగ్గడం, విపరీతమైన నీరసం, కీళ్ల నొప్పులు, జుట్టు రాలడం, నోటి పూత, రక్తకణాలు తగ్గడం, మూత్రపిండాలు పాడవడం, మూర్ఛవ్యాధి, అబార్షన్లు, పిల్లలు లేకపోవటం, బహిష్టు సమయంలో అధిక రక్తస్రావం, ముఖంపై, శరీరంపై సీతాకోకచిలుక ఆకారంలో దద్దుర్లు కనిపిస్తాయి.

తొలిదశలో గుర్తించవచ్చు

యుక్తవయస్సులో ఉన్న ఆడవారిలో లక్షణాలు కనిపిస్తే తక్షణమే రుమటాలజిస్టును సంప్రదిస్తే ఏఎన్ఏ, డీఎస్‌డీఎన్ఏ రక్తపరీక్షల ద్వారా వ్యాధిని తొలిదశలోనే గుర్తించి చికిత్స అందించవచ్చు. లూపస్‌వ్యాధి నిర్ధారణ చేసే సమయానికే కనీసం మూడేళ్ల ముందుగానే శరీరంలో మార్పులు ఉంటాయి. కొన్ని సార్లు వైద్యులు వ్యాధిని గుర్తించేలోగా కిడ్నీ ఫెయిల్యూర్, మూర్ఛవ్యాధి, గుండెజబ్బుల వల్ల మరణం సంభవిస్తుందని వైద్యులు చెబుతున్నారు.


కిడ్నీలను దెబ్బతీస్తుంది....



లూపస్‌వ్యాధి కిడ్నీలో నెఫ్రాన్స్‌ని దెబ్బతీస్తూ రక్తాన్ని శుద్ధి చేయకుండా చేయటం వల్ల కిడ్నీలు ఫెయిల్ అవుతాయి. మొదటి దశలో వ్యాధిని గుర్తిస్తే కిడ్నీలు పూర్తిగా పాడవకుండా కాపాడి పనిచేసేలా చేయవచ్చు. న్ని రకాల మందులతో కిడ్నీ వ్యాధిని పూర్తిగా అదుపులో పెట్టవచ్చు. నిపుణులైన వైద్యులు కూడా వ్యాధిని, వ్యాధి తీవ్రతను అంచనా వేయలేకపోతున్నారు. దీనివల్ల వేలాదిమంది కిడ్నీలు ఫెయిల్ అయ్యి మరణిస్తున్నారు.

– డాక్టర్ చింతా రామకృష్ణ, సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు

అవగాహనతో నియంత్రణ సాధ్యం



అనుభవజ్ఞులైన వైద్యుల సమక్షంలో తగిన మోతాదులో సరైన సమయంలో మందులు వాడితే వ్యాధిని నియంత్రణలో పెట్టవచ్చు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఒత్తిడి తగ్గించుకోవడం, మంచి ఆహారం తీసుకోవడం, మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండటం, సూర్యరశ్మి నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధి పూర్తి నియంత్రణలో ఉంటుంది.

– డాక్టర్ మానుకొండ మురళీకృష్ణ, రూమటాలజిస్టు, గుంటూరు

ఏకలవ్యుడు స్ఫూర్తి ప్రదాత

తాడేపల్లిరూరల్: గురువు లేకపోయినా విలు విద్యలో రాణించిన ఏకలవ్యుడు స్ఫూర్తి ప్రదాత అని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీం బాషా అన్నారు. మంగళగిరి– తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఏకలవ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి 23 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం గిరిజన నాయకులు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కమిషర్ ఏకలవ్య, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, మంచి సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమన్నారు. ద్రోణాచార్యుల వద్ద నిరాకరింపబడ్డ ఏకలవ్యుడు పట్టువదలకుండా ధనుర్విద్యను.. ద్రోణాచార్యుడి ప్రతిమను నెలకొల్పి సాధనతో సాధించారన్నారు.